క్లుప్తంగా

పంట ఇన్సూరెన్స్‌కు నేడు తుది గడువు



వీఏఏలతో మాట్లాడుతున్న ఏఓ కే రమేష్ బాబు

మద్దిపాడు: మండలంలోని రైతులు తాము వేసిన పంటలను ఇన్సూరెన్స్ చేయించుకోవడానికి డిసెంబర్ 31వ తేదీ తుది గడువు అని ఏవో కే రమేష్ బాబు తెలిపారు. సోమవారం మండల వ్యవసాయ కార్యాలయంలో వీఏఏలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకునేందుకు రైతులకు అవగాహన కల్పించాలని వీఏఏ లకు సూచించారు. వీఏఏలు రైతులు వేసిన పంటలను ఈ పంట యాప్ లో నమోదు చేయాలన్నారు. రైతులకు అనునిత్యం అందుబాటులో ఉంటూ వారికి సహాయకారులుగా పని చేయాలని ఆయన వీఏఏలను ఆదేశించారు.

బాల్య వివాహ వ్యవస్థను నిర్మూలించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో వసంతరావునాయక్

పుల్లలచెరువు: గ్రామాల్లో జరుగుతున్న బాల్య వివాహ వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో వసంతరావునాయక్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం బడిమానేసిన కిశోర్ బాలికలకు ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ బడిబాట పట్టాలని, అందరు చదువుకున్నప్పుడే బాల్య వివాహాలు జరగవని చెప్పారు. సూపర్‌వైజర్ శివలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం కౌమార దశలో ఉన్న బాలికలు అనిమీయా వ్యాధితో బాధపడుతున్నారని, వారు ఎలాంటి ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారో వివరించినట్లు తెలిపారు. డాక్టర్ నరసింహం మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం నేరమని, అలా చేస్తే వారి ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని, దీంతో అనేక పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. మండల అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు అధికారుల తమ వంతుగా కృషి చేయాలన్నారు. ఈవోఆర్డీ శ్రీనివాసరావు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

దొనకొండ: వేగంగా ఆటో వెళ్తూ వ్యక్తిని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని పెద్దగుడిపాడు ఎస్సీ కాలనీ మెయిన్ రోడ్డులో సోమవారం జరిగింది. తెలిసిన వివరాలు.. పెద్దగుడిపాడు ఎస్సీ కాలనీకి చెందిన గన్నెపల్లి ఆనందరావు గంగదేవిపల్లి గ్రామానికి పనిపై వెళ్లాడు. పని ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఇంటికి వస్తుండగా వేగంగా వెళ్తున్న ఆటో ఢీకొట్టడంతో ఆనందరావుకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ప్రథమ చికిత్స చేసి దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈఎంటీ వెలుగొండయ్య, పైలట్ నరేష్‌బాబును ఓటీ రాజేంద్రప్రసాద్, డీఎం విజయ్‌కుమార్ అభినందించారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

దర్శి: మండలంలోని అగ్నిపురి కాలనీకి చెందిన గుంటూరు యశోద అనే మహిళకు పురిటి నొప్పులు వచ్చాయి. స్థానికులు 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే ఆమె నివాసానికి చేరుకున్న ఈఎంటీ వేణుగోపాల్, పైలట్ నరేష్ బాబులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమెకు నెప్పులు అధికంగా వస్తున్నందున వెంటనే కాన్పు చేయాలని కుటుంబ సభ్యులకు తెలిపారు. కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు సిబ్బంది 108 వాహనంలోనే కాన్పు చేశారు. యశోద పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు. యశోద కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వైద్య పరీక్షల కోసం తల్లి, బిడ్డను దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు.

ఉన్నా..ఉపయోగం సున్నా

- నిరుపయోగంగా మార్కెటింగ్ యార్డు
- వసతులన్నీ ఉన్నా పర్యవేక్షణ శూన్యం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు
- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు

కొత్తపట్నం: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర వచ్చేందుకు ప్రభుత్వం మార్కెట్ యార్డును ఏర్పాటు చేసింది. సుమారు 5 ఎకరాల పొలంలో యార్డు నిర్మాణం చేపట్టింది. అందులో రోడ్లు, ప్లాట్‌ఫాంలు, ప్రహరీల నిర్మాణం చేపట్టారు. ధాన్యం నిల్వ చేసుకునేందుకు రైతులకు కావాల్సిన అన్ని వసతులు కల్పించింది. మండలంలో ప్రధానంగా శనగ, వేరుశనగ, వరి పంటలు సాగు చేస్తారు. కొంత కాలం రైతులు దీనిని బాగానే ఉపయోగించుకున్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర వచ్చేంత వరకు నిల్వ చేసుకుని మంచి ధర వచ్చినప్పుడు విక్రయించేవారు. పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో నడిపేవారు. రైతుల దగ్గర యార్డులో నిల్వ చేసేందుకు కొంత నగదు వసూలు చేసి యార్డును అభివృద్ధి చేశారు. కొంత కాలం అయిన తరువాత మార్కెట్ యార్డును పట్టించుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. దీంతో మార్కెట్ యార్డు శిథిలావస్థకు చేరింది. ప్లాట్‌ఫాంలు, షెడ్ శిథిలమయ్యాయి. యార్డులో ఉన్న సామానులు, తలుపులు, బల్లలు దొంగలు పాలయ్యాయి. అందులో నిల్వ చేసుకోవాలంటే వసతులు లేక, నిల్వచేసిన ధాన్యం పక్షులు, ఎలుకల పాలవుతాయని రైతులు నిల్వ చేసుకోవడానికి ముందుకు రావడంలేదు. ఆరోజుకు ఎంతో కొంత ధరలకు అమ్ముకుంటున్నారు. మార్కెట్ యార్డు ఉండి ఉంటే ధర వచ్చేంత వరకు ఉంచుకుని అమ్ముకుంటామని రైతులు అంటున్నారు. అధికారులు, ప్రభుత్వం పట్టించుకుని మార్కెట్ యార్డును ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.



కొత్తపట్నంలో నిరుపయోగంగా ఉన్న మార్కెట్ యార్డు



ఖాళీగా ఉన్న మార్కెట్ యార్డు



శిథిలమవుతున్న మార్కెట్ యార్డు భవనం



దెబ్బతిన్న గ్రావెల్ రోడ్డు

పాస్టర్లకు దుస్తుల పంపిణీ

సంతనూతలపాడు: మండల కేంద్రంలోని మోరియా ప్రార్థన మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ నియోజకవర్గంలోని పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని సంతనూతలపాడు మాజీ సర్పంచ్, బాపట్ల పార్లమెంట్ టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రంపతోటి అంకారావు పర్యవేక్షించారు. పాస్టర్లకు ఇళ్ల స్థలాలు, ప్రార్థన మందిరాలకు స్థలాలు కేటాయించాలని పలువురు పాస్టర్లు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా పాస్టర్లకు ఈ దుస్తులు పంపిణీ చేస్తున్నట్టు ఎమ్మెల్యే విజయ్ కుమార్ వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ బుడంగుంట విజయ, సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి, మాజీ సర్పంచ్ ఆర్.అంకారావు, పాస్టర్స్ ఎఫ్రాయం, ఆర్డర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పెన్షన్ల పంపిణీ

సంతనూతలపాడు: మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను మంగళవారం నుంచి లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో డీ సురేష్ బాబు తెలిపారు. మండలంలో 6766 మంది వివిధ వర్గాల లబ్ధిదారులకు రూ.2,87,06,000 పెన్షన్లు పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. సోమవారం పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు బ్యాంకుల నుంచి పెన్షన్లకు సంబంధించి నగదును డ్రా చేసినట్టు ఎంపీడీవో సురేష్ బాబు వెల్లడించారు. సచివాలయ సిబ్బంది ఈనెల 31వ తేదీ, జనవరి 2న లబ్ధిదారుల గృహాల వద్ద ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

అంబేడ్కర్‌ను అవమానించడం సిగ్గుచేటు



నిరసన వ్యక్తం చేస్తున్న విజయ్‌కుమార్, సురేంద్ర, గ్రామస్తులు

కొత్తపట్నం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను హోంశాఖ మంత్రి అమిత్ షా అవమానించడం సిగ్గు చేటని అంబేడ్కర్ యువజన సంఘ నాయకుడు చెక్కా సురేంద్ర అన్నారు. ఈ సందర్భంగా సంకువారిగుంటలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అంతా కలిసి కొద్దిసేపు నినాదాలు చేశారు. అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని, పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. చెక్కా సురేంద్ర మాట్లాడుతూ హోంమంత్రిగా ఉంటూ అంబేడ్కర్‌ను అవమానించడం మంచి పద్ధతి కాదని, అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు. అలా చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామీణ దళిత మహాసభ జిల్లా అధ్యక్షుడు దుగ్గిరాల విజయకుమార్, స్వర్ణ రాజ్‌కుమార్, చిట్టితోటి జాలరావు, చిటితోటి విజయభాస్కర్, కొట్టే సింగారావు, స్వర్ణ పృద్వీరాజ్ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, టీచర్స్

చీమకుర్తి: ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘానికి చెందిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను చీమకుర్తిలోని ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద ఎంఈఓ డీవీఎల్ నరశింహారావు చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎంఆర్‌సీ కార్యాలయం సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ సంఘం నాయకులు జే.యాకోబు, ఏ.హరిబాబు, ఆదిశేషు, శ్రీనివాసరావు, ఆంజనేయులు స్థానికులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు పరిష్కారం



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ మధుసూదన్‌రావు



ఎర్రగుడిపాడు రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆర్ బ్రహ్మయ్య

గుండమాల (కొత్తపట్నం): రెవెన్యూ సదస్సులో వచ్చే ప్రతి అర్జీని పరిష్కరిస్తామని తహసీల్దార్ పి.మధుసూదన్‌రావు అన్నారు. గుండమాలలో సోమవారం రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో రెవెన్యూ సభలు జరుగుతున్నాయని, వాటిలో వచ్చే అర్జీలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. పెండింగ్ భూ సమస్యలు, హెచ్చు తగ్గులు కొలతలు, మ్యూటేషన్, పాసుపుస్తకాలు ఇస్తున్నట్లు చెప్పారు. గుండమాలలో 28 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఆర్ఐ వరప్రసాద్, సర్పంచ్ కారాని జయరావు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 3 అర్జీలు

చీమకుర్తి రూరల్: మండలంలోని తొర్రగుడిపాడు సచివాలయ పరిధిలో ఎర్రగుడిపాడు గ్రామంలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు 3 అర్జీలు వచ్చాయని మండల రెవెన్యూ అధికారి ఆర్ బ్రహ్మయ్య తెలిపారు. వారు మాట్లాడుతూ రైతులకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారానికి జనవరి 8వ తేదీ వరకు గ్రామ స్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారని, ప్రజలు ఈ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెవెన్యూ సదస్సుకు 3 అర్జీలు వచ్చాయని ఈ అర్జీలు ఆన్‌లైన్ కోసం భూమి కొలతలు సర్వే చేసేందుకు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్ సమయాన్ని పొడిగించాలి



కృష్ణాపురంలో మాట్లాడుతున్న నాయకులు

దర్శి: సోషల్ ఆడిట్ సమయాన్ని పొడిగించాలని ఎంఈఎఫ్, ఎంఆర్‌పీఎస్ నాయకులు అట్లూరి రామారావు, ఆర్.యోహాన్ డిమాండ్ చేశారు. మండలంలోని కృష్ణాపురంలో సోమవారం ఎస్సీ, ఎస్టీలతో సమావేశం అనంతరం రామారావు, యోహాన్‌లు మాట్లాడుతూ మండలంలో సోషల్ ఆడిట్ ద్వారా ఎస్సీ,ఎస్టీ జాబితాల విడుదలలో ఎస్సీ, ఎస్టీలను క్రిస్టియన్‌గా చూపారన్నారు. సోషల్ ఆడిట్‌లో దొర్లిన పొరపాట్లను సరిచేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని అన్నీ గ్రామాల్లో మొత్తం ఇదే పరిస్థితి నెలకొందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి బాధితుల సమస్యలకు పరిష్కార మార్గం చూపాలని డిమాండ్ చేశారు. నాయకులు ఆర్.కోటయ్య, బండి దేవప్రసాద్, బెంజిమన్, యోహాను, ఆల్‌ఫ్రెడ్ పాల్గొన్నారు.

వాసవీ మహిళా క్లబ్‌కు నూతన కమిటీ ఎన్నిక



క్లబ్ కు నూతనంగా ఎన్నికైన సభ్యులు

సంతనూతలపాడు: సంతనూతలపాడు వాసవీ మహిళా క్లబ్ కి నూతన కమిటీని ఎన్నుకున్నారు. వాసవీ మహిళా అధ్యక్షురాలిగా చలువాది చంద్రావతి, గౌరవాధ్యక్షురాలిగా గ్రంధి సులోచన, సెక్రటరీగా శిఖాకొల్లి జయ శ్రీ,, కోశాధికారిగా గాదంశెట్టి శ్రీ లక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పబ్బిశెట్టి శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు జి.శరత్ బాబు వాసవీ క్లబ్ జిల్లా ప్రతినిధులు వీ.ఎస్.ప్రసాద్ రావు, జి.ఎల్. ప్రసాదరావు పలువురు ఆర్యవైశ్య నేతలు పాల్గొన్నారు.

మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షునిగా పబ్బిశెట్టి శ్రీనివాసరావు:

సంతనూతలపాడు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా పేర్నమిట్టకు చెందిన పబ్బిశెట్టి శ్రీనివాసరావు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంతనూతలపాడు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షునిగా గ్రంధి శరత్ బాబు, సెక్రటరీగా ఎస్‌వీవీ మల్లికార్జునరావు, వైస్ ప్రెసిడెంట్ గా చీదెళ్ల సత్యనారాయణ, ట్రెజరర్ గా మునగా మారుతీ రావులను ఎన్నుకున్నారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మువ్వల శ్రీనివాసులు, జిల్లా ఆర్యవైశ్య సంఘం జాయింట్ సెక్రటరీ చెక్కా సుబ్బరాయుడు నియామక పత్రాలు అందజేశారు.

గ్రామ రెవెన్యూ అధికారుల కార్యవర్గం ఎంపిక



తహసీల్దార్ సుజన్ కుమార్‌తో గ్రామ రెవెన్యూ అధికారుల నూతన కార్యవర్గం

మద్దిపాడు: మండలంలో గ్రామ రెవెన్యూ అధికారుల నూతన కార్యవర్గ ఎంపిక సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారుల నూతన కార్యవర్గ అధ్యక్షురాలిగా ఎస్‌కే ఆరిఫా, ఉపాధ్యక్షుడుగా సీహెచ్ దీపక్, కార్యదర్శులుగా కే అంకమ్మరావు, ఎస్ కే మీరావలి, ఈసీ సభ్యులుగా జీ సుధాకర్, ఈ పూజితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులు తహసీల్దార్ సుజన్ కుమార్ ని మర్యాద పూర్వకంగా కలిశారు.

సెప్టిక్ ట్యాంక్ వర్కర్లకు పీపీఎఫ్ కిట్ల పంపిణీ



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఒంగోలు టౌన్: స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో నమస్తే కార్యక్రమంలో భాగంగా నగర కార్పొరేషన్‌లో పనిచేస్తున్న 10 మంది సెప్టిక్ ట్యాంక్ వర్కర్లకు పీపీఎఫ్ కిట్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హానికరమైన ప్రదేశంలో పనిచేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రతల గురించి అవగాహ కల్పించారు. నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కోడూరు వెంకటేశ్వరరావు, ఎంహెచ్ఓ మనోహరరెడ్డి, ఎస్ఎస్ నూకతోటి పిచ్చయ్య, కార్పొరేటర్ శాండిల్యా, నమస్తే స్టేట్ కో ఆర్డినేటర్ అనిల్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

మాదిగ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



ఎంఈఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంద కృష్ణమాదిగ

ఒంగోలు వన్‌టౌన్: మాదిగ ఉద్యోగుల 2025 క్యాలెండర్‌ను ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆవిష్కరించారు. గుంటూరులోని ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం రాత్రి జరిగిన ఎంఈఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆయన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిలమూరు శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి భిక్షాలు, జాతీయ ఉపాధ్యక్షుడు బొంత ఏసుదాసు, ప్రకాశం జిల్లా ఎంఈఎఫ్ అధ్యక్షుడు కత్తి ఐజక్, బాపట్ల జిల్లా అధ్యక్షుడు వంగేవరపు రమేష్, రాష్ట్ర కార్యదర్శి సర్వేపల్లి రవి రాజు పాల్గొన్నారు.

పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంచాలి

- మార్కాపురం డీఎస్పీ నాగరాజు



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న డీఎస్పీ నాగరాజు, పక్కన ఎస్ఐ సంపత్



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ నాగరాజు

పుల్లలచెరువు: శాంతి భద్రతల నిర్వహణలో జవాబుదారీగా ఉంటూ పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకాన్ని పెంచాలని మార్కాపురం డీఎస్పీ నాగరాజు అన్నారు. సోమవారం ఆయన స్థానిక పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా గ్రామస్తుల సహకారంతో వివిధ గ్రామాల కూడలిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణను పరిశీలించి వివిధ గ్రామాలకు చెందిన పోలీసు రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ చట్టం దృష్టిలో అంతా సమానమేనని, ఎవరూ అతీతులు కారని, ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చిన వారిని మర్యాదగా పలకరించి బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని చెప్పారు. స్టేషన్‌లో ఉన్న పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. మండలంలోని ప్రతి గ్రామం ప్రశాంతంగా ఉండేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. గ్రామాల్లో పొలం తగాదాలు, నగదు వివాదాలు, ఆస్తి పంపకాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఎవరికైనా సమస్యలు ఉంటే ముందుగానే పోలీసుల దృష్టికి తీసుకు రావాలన్నారు. ఇటీవల కాలంలో జరిగిన లోక్ ఆదాలత్ కార్యక్రమంలో పుల్లలచెరువు పోలీసుస్టేషన్ పరిధిలో 13 కేసులు పరిష్కారం కావడంతో ప్రత్యేకంగా ఎస్ఐ సంపత్‌కుమార్‌ను డీఎస్పీ నాగరాజు అభినందించారు. స్టేషన్ పరిధిలో ఇటీవల క్రైమ్ రేటు బాగా తగ్గిందని చెప్పారు. గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌లు ధరించాలని చెప్పారు. నూతన సంవత్సర వేడుకలను జాగ్రత్తగా జరుపుకోవాలని, ప్రతి గ్రామ కూడలిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలతో మండలంలో ఏం జరుగుతుందని తెలుసుకునే వీలుంటుందని, పుల్లలచెరువు పోలీసుస్టేషన్‌ను ఆదర్శంగా తీసుకుని డివిజన్ మొత్తంలో అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వెంకమ్మ జ్ఞాపకార్థం దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందుకుంటున్న పేదలు

ఒంగోలు మెట్రో: అన్నాబత్తిన వెంకమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు ప్రభాకరరావు, ఘనశ్యామ్ ఆధ్వర్యంలో నగరంలో పేదలకు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం వారికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మానవతా సేవా సంస్థ కన్వీనర్ మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ అన్నాబత్తిన వెంకమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో చలికాలంలో ఏ దిక్కూ లేని పేదలకు దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. వెంకమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి, పెద్దిశెట్టి శ్రీహరి, అన్నాబత్తిన కళ్యాణకృష్ణ, ఇందు హాసిని, శ్రీను, దత్తు, కుర్రా ప్రసాద్ పాల్గొన్నారు.